# పోర



## ___టి.వి.రామాచారి

ఒక సాయంత్రం పూట రమణారావు ఆఫీసు నుంచి వచ్చి గజిబిజిగా ఉన్న టేబుల్ని సర్దుతూంటే పుస్తకాల అడుగున ఒక కవరు కనిపించింది. ఏమిటాని తీసి చూస్తే అందులో "ఆంధ్రా ఎక్స్‌ప్రెస్" ఆదివారం ప్రత్యేక సంచిక ఉంది. కవరు మీదున్న పోస్టల్ ముద్ర చూస్తే అప్పుడే అదొచ్చి రెండు రోజులయింది! గబగబా ఆ పత్రిక పేజీల్ని తిరగేస్తే తను పంపిన కథ ప్రముఖంగా అచ్చయింది అందులో. ఆ కథకు వేసిన బొమ్మ కూడా ఎంతో చూడముచ్చటగా ఉంది. తనపేరు పలు రంగుల్తో ఎంతో ఆకర్షణీయంగా ఉంది. గత పదేళ్ళుగా ప్రచురితమయిన తన కథలన్నింటికన్నా ఈ కథ బాగుంది. అందుకేనేమో దీనికింత ప్రాముఖ్యాన్నిచ్చారు పేపరు వాళ్ళు. అయినాఇదొచ్చి రెండురోజులయినా దీని గురించి ఇంటివాళ్ళే పట్టించుకోలేదు. అస్సలు ఇదొచ్చినట్టు తనకెవ్వరూ చెప్పనైనా చెప్పలేదు! ఇతర్ల సంగతెలా ఉన్నా కనీసం తన భార్యామణి అయినా పట్టించుకుని ఉండవలసింది. అలా పట్టించుకోనందుకు ఆమె మీద రమణకు చాలా నే కోపం వచ్చింది. ఆ కోపంతోనే కేకేశాడామెను!

"సరూ..."

"....."

"ఓ సరూ..."

"...."

ఆమె ఎంతకీ పలకక పోయేసరికి ఈసారి గట్టిగా అరిచాడు.

"ఓ సరస్వతీ..." ఆ అరుపులో కోపం, కసి, విసుగు ధ్వనించాయి.

"ఆ... వస్తున్నా. ఏమిటండీ? ఎందుకా అరుపు కొంగుతో చేతిని తుడుచుకుంటూ వచ్చి ఆయన ముందు నిల్చుంది సరస్వతి.

"దీన్ని చూశావా?"

"దేన్నండీ?"

"ఇదే ఈ పత్రికని?"

"ఆ చూశా ఏమయింది దానికి?"

"ఏమయినా కావటంకాదు. ఇదెప్పుడొచ్చిందీ అవి?"

"మొన్నెప్పుడో వచ్చింది. ఆ బల్లమీదే పెట్టాగా? ఇప్పుడెందుకీ రాద్ధాంతం" అంటూ పోబోయింది.

ఆగు. అలా పోతావేం. దాన్ని విప్పి చూశావా?"

"నాకేం పనండీ దాంతో. నేనెందుకు విప్పుతాను దాన్ని?" అంటూ కదిలింది.


తన భార్య ఎమ్మే చదివినా ఈ పత్రికను విప్పి ఇందులో ఉన్న తన కథని కనీసం చూడనైనా చూడనందుకు రమణకు పట్టరానికోపమేవచ్చిం ు. ఆ కోపంతోనే!

"నీ నిర్వాకం చాలుగాని ఇహ లోపలకు దయ చెయ్" అని గద్దించాడు. పాపం ఆమె బిక్క మొహం వేసుకొని లోపలకు వెళ్ళిపోయింది.

తన కథ గురించే ఆలోచించటం మొదలెట్టాడు రమణ. ఏమిటీ తనింత కష్టపడి ఒక మంచికథ రాస్తే దాన్ని ఒక ప్రముఖ దినపత్రిక ప్రచురిస్తే— అందునా ఆదివారం అనుబంధంలో దాన్ని ఎవ్వరూ పట్టించుకోవడం లేదేమిటీ? ఆ కథతో పాటు తన పేరు రంగురంగుల్లో అచ్చయినా కనీసం తన భార్య అయినా చూడదేం? ఇలా ఆలోచిస్తున్న రమణకు చాలా చిన్నతనమనిపించింది.

"వేణు ఉన్నాడాండీ?" అంటూ పక్కింటి అబ్బాయి లోపలకొచ్చాడు. వాణ్ణి చూస్తూనే రమణకు రవంత ఆశ పొడచూపింది. కనీసం పక్కింటి వాళ్ళయినా తన కథను చదివుంటారని. కాని ఈ విషయం తెలుసుకునేదెలా? కొంచెం ఆలోచించి!

"రా బాబూ లోపలికిరా. వేణు కోసం వచ్చావా? వాడు లేడే! ఇప్పుడే ఎక్కడికో బయటికెళ్ళాడు." అని మళ్ళీ "మీరేం పేపరు తెప్పించుకుంటారు బాబూ!" అనడిగాడు.



"ఇంగ్లీషు పేపరు తెప్పించుకుంటాం అంకుల్" అని వెళ్ళిపోయాడా కుర్రవాడు. దాంతో రమణకు నిరాశ మరీ ఎక్కువయింది.

తన కథ రెండు రోజుల క్రితం అచ్చయితే ఇప్పటివరకూ దాన్ని ఒక్కడైనా 'నేను చదివాను' అన్న వ్యక్తి కనిపించలేదతనికి. దీన్ని రేపయినా ఆఫీసుకి తీసుకెళ్ళి, తనకు తెలుసున్న నలుగురికీ చూపించి, వాళ్ళకి చదివి వినిపించి, అదెలాగుందో వాళ్ల అభిప్రాయం తెలుసుకోవాలనుకున్నాడు.

రాత్రి ఎనిమిదవబోతుంటే వాళ్ళబ్బాయి వేణు ఉరుకులూ పరుగులమీదొచ్చి.

"అమ్మా.. నా కన్నం పెట్టవే. అర్జంటుగా నేను మళ్ళీ పోవాలి" అని తొందరించేడు.

"ఇంటికొచ్చావో లేదో మళ్ళీ ఎక్కడికీ? ఏమిటీ తొందరా?" విసుగ్గానే అడిగాడు రమణ.

"......"

"అస్సలు ఇంట్లో ఏం జరుగుతుందో నీకేమయినా తెలుసా?"

"అన్నిటికీ మీరున్నారుగా నాన్నా. మధ్యన నేనెందుకూ? నా చదువేదో నన్ను చదువుకోనివ్వండీ... ప్లీజ్..."

"ఏం జరుగుతుందో దేన్నీ పట్టించుకోనంటే ఎట్లా? అన్నట్లు ఆ బల్లమీదున్న పేపర్ని చూశావా?"

"చూశాను"

"ఏముంది అందులో?"

"విప్పి చూడలేదనుకోండి" అంటూ డ్రస్సు విప్పేసి, లుంగీ కట్టుకుని బిర బిరా బాత్ రూంలోకి వెళ్ళిపోయాడు వేణు. దాంతో ఆ తండ్రికి తల తీసేసినంత అవమానమయింది. తనొక మంచి కథను రాస్తే— అది ప్రముఖ దినపత్రికలో అచ్చయినా రేపు ఐ.ఎ.ఎస్ రాయబోయే తన కొడుకు ఏ మాత్రం పట్టించుకోవడంలేదేం? కనీసం ఆ పత్రికను విప్పి ఆ కథ పేరు చదివి, దానికి వేసిన బొమ్మను చూసి, తనపేరును గమనించి 'బాగుంది' అనైనా అనొచ్చుగా? అటు సరస్వతి పేరు పెట్టుకున్న తన భార్యగానీ, ఇటు బృహస్పతి లాంటి బుద్ధి ఉందనుకున్న తన కొడుకు గానీ తన కథ గురించి ఏ మాత్రం పట్టించుకోవటంలేదని పాపం రమణ అతి బాధపడిపోయాడు.

ఈ మధ్య అస్సలీ ప్రపంచం ఎటు పోతున్నదీ? ఎవ్వరికీ దేని మీదా ఆసక్తిలేదు! ఎందుచేతో? ఆశ్చర్యమేసింది రమణకి.

ఇలా ఆలోచిస్తూ రమణ ఆ రాత్రంతాగడిపాడు.

మర్నాడుదయం ఆ పత్రికని చేతబుచ్చుకొని పెందరాళే ఆఫీసుకు బయలు దేరాడు. బస్సు స్టాండుకి నడుస్తూంటే దారిలో మిత్రుడు రామకృష్ణ కనిపించాడు.

"హల్లో రమణా. ఏమిటీవేళ తొందరగా బయలు దేరారే?" అన్నాడు.

'అవును కొంచెం పనుంది" అని మళ్ళీ "అన్నట్టు రామకృష్ణా పోయిన ఆదివారం ఆంధ్రా ఎక్స్‌ప్రెస్ చూశావేమిటి?" అనడిగితే—

ఆయన "చూడటమేమిటి? అందులో నా సమీక్షపడితేనూ!" గర్వంగా అన్నాడు రామకృష్ణ.

"ఏమిటీ? ఈ రామకృష్ణ రాసిన సమీక్ష ఆంధ్రా ఎక్స్‌ప్రెస్‌లో పడిందా? అందులోనూ ఆదివారం అనుబంధంలో! అందులో మహా మహా మేధావులవే పడవే. తన కథ అయినా తనెంతో కష్టపడి రాశాడు గనక అందులో పడింది. అలాంటిది ఈ రామకృష్ణ వ్యాసం అందులో అచ్చయిందంటే ఇక తన కథ గొప్పతనమేముంది?" అని తనలో తనే వాపొయ్యాడు రమణ. అయినా పైకి మాత్రం మామూలుగానే నవ్వుతూ—

"అలాగా! నేను చూడలేదు రామకృష్ణా. ఏదీ? ఎక్కడుంది? ఎన్నో పేజీలో ఉంది నీ సమీక్ష?" అనడిగాడు.

"ఆ పేపరు నీ దగ్గరే ఉందన్న మాట! ఇకనేం? మూడవ పేజీ తీసిచూడు. దాని కాపీల్ని జిరాక్స్ తీయించి మన స్నేహితులకి ఇచ్చావా. నీకూ ఇద్దామనే అనుకున్నా కానీ కాపీలు మిగల్లా"

"ఓరి పిడుగా. నీ వ్యాసం అచ్చయిందని తెలుసుకోవటం, కాపీలు తీయించి పది మందికీ ఇవ్వటం జరిగిపోయిందా! మరి నేను చూడు. నా కథ ఎంత ప్రముఖంగా అచ్చయినా అస్సలు అది అచ్చయినట్టయినా ఇంతవరకూ ఎవరికీ తెలియదు. ఒక్కనాకు తప్ప" అని రామకృష్ణ అదృష్టానికి ఈర్ష్య, తన దురదృష్టానికి విచారమూ కలిగాయ తనికి. అయినా వాటిని బయటకు కనబడనివ్వకుండా చేతిలో ఉన్న పేపర్ని విప్పి మూడవ పేజీ తీశాడు. అక్కడ ఏ వ్యాసమూ లేదు. మామూలుగా ఆ వారం శీర్షికలమీద పాఠకులు తమ అభిప్రాయాల్ని తెలుపుతూ రాసే ఉత్తరాల శీర్షిక ఉంది. ఆ మాటే రామకృష్ణతో అంటే అతను—

"అదేనోయ్. పోయిన వారం 'స్టేట్ రౌడీ' సినిమా మీద ఈ పత్రికలో పడిన సమీక్షమీద నా అభిప్రాయం రాశాను. దాన్ని వాళ్ళు యథాతథంగా వేసుకున్నారు. కనిపించటంలా?..." అని రమణ చేతిలో ఉన్న పత్రికలో తన ఉత్తరం ఎక్కడున్నదీ వేలు పెట్టి చూపించాడు. అందులో ఉన్నది కేవలం నాలుగంటే నాలుగే పంక్తులు. ఇంతదానికే అతనింతగర్వపడిపోతున్నాడే? అని ఆశ్చర్యమేసింది రమణకు. సరే అతన్ని కించపరచటం దేనికని ఆ నాలుగు లైన్లూ చదవి 'బాగుంది' అన్నాడు.

"చదివినవాళ్ళంతా 'చాలాబాగుంది' అనంటావుంటే నీవేమో పొడిగా 'బాగుంది' అంటావేమిటీ? నీకు సాహిత్యం మీద అభిరుచి లేదా? అయిదేళ్ళనుంచీ నేను పడుతున్న కష్టం నేటికి ఫలించింది..." చెప్పుకుపోతున్నాడు రామకృష్ణ.

"ఏమిటీ? తన ఉత్తరం పత్రికలో పడటానికి ఇతగాడు ఐదేళ్ళనుంచి కష్టపడుతున్నాడా? ఈ భాగ్యానికే అతనింతగా సంబరపడిపోతున్నాడు. మరి నా కథలు, వ్యాసాలు, కవితలు— పేజీలకు పేజీలు పదేళ్ళ నుంచి ప్రచురితమవుతూ ఉంటే ఎవ్వరూ అడగనన్నా అడగటం లేదే? అస్సలు నేనొక రచయితనన్న విషయం కూడా ఎవ్వరికీ తెలియదే? తన ఉత్తరం పడిందని మురిసిపోతున్న రామకృష్ణ అదే సంచికలో నా కథానిక పడినా చూడలేదేం? కొందరికి తమ విషయాలు తప్ప ఇతర్ల విషయాలు మెదడుకెక్కవు! ఎందుకోమరి?

## అయిపోతుంది

"మ్యాచింగ్ కలర్. లైట్ గ్రీన్ ఇవ్వమంటే ఇంత ముదురు రంగు ఇచ్చావేం"

"ఒకసారి ఉతకండి మేడం, ఆ తర్వాత ఆటోమేటిక్‌గా అదే లైట్ అయిపోతుంది" జవాబిచ్చాడు సేల్స్‌మన్.

—ఇస్మాయిల్,
ఉదయగిరి.

### సైన్‌బోర్డ్ హాస్యం

**బొంబాయిలో ఒక షాపు ముంగిట: 'ఇచ్చట జిరాక్స్ కాపీలు అన్ని బాషలలోను చేయబడు ను' అని ఉంది.**

పొర ఏదయినా అడ్డుకుంటూ ఉండాలి. రమణ ఇలా ఆలోచిస్తూ నడుస్తుంటే బస్సు స్టాండు రావటం, అప్పుడే ఒక బస్సు వచ్చి ఆగటం జరిగింది. అతను పరుగెత్తుకెళ్ళి అందులోకెక్కాడు. ఆ బస్సులో తనెరుగున్న వాళ్ళెవరైనా ఉన్నారేమో వాళ్ళకి తన కథను చూపుదామని ఒక్కసారి ఆ బస్సులో అంతా కలియ చూశాడు. కాని ఎవ్వరూ కనిపించలా. నాంపల్లి బస్సుస్టాపులో దిగి తలొంచుకుని గాంధీ భవన్ వైపు నడక సాగించాడు.

"ఏమిటీ రమణ గారూ అంత దీర్ఘంగా ఆలోచిస్తూ నడుస్తున్నారు?" అంటూ వెనక నుంచి స్కూటరు మీద వస్తున్న విశ్వనాథం పలకరించాడు. ఈయన హైయ్యర్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్‌లో ఒక అధికారి. ఇంతకు ముందు ఏదో కాలేజీలో లెక్చరర్‌గా పనిచేసి సర్వీస్ కమిషన్ సెలెక్షన్ వచ్చి అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేస్తున్నాడు. మనిషికి సాహిత్యమంటే మంచి టేస్టుంది. సభల్లోనూ, మీటింగుల్లోనూ ఉపన్యాసాలిస్తూ ఉంటాడు. ఆయన్ను చూచి రమణ "హమ్మయ్య! ఇప్పటికిగాని సరైన వ్యక్తి దొరకలేదు" అని మనస్సులోనే అనుకున్నాడు. ఈయన తప్పకుండా నా కథను చదివుంటాడు. అందుకే ఎన్నడూ లేంది ఇప్పుడు పలకరిస్తున్నాడు" అని అనుకున్నాడు రమణ.

"ఆ ఏం లేదు. అన్నట్టు విశ్వనాథంగారూ పోయిన ఆదివారం ఆంధ్రా ఎక్స్‌ప్రెస్ గాని చదివారేమిటి?" అనడిగాడు.

"ఆ చదివాను. మొదటి పేజీ దగ్గర్నుంచి చివరి పేజీదాకా క్షుణ్ణంగా చదివాను. ఏం?"

"ఏం లేదూ అందులో ఉన్న కథ ఎలాగుందో మీ అభిప్రాయం తెలుసుకుందామని"

"కథా? చదివినట్టే జ్ఞాపకం. కానీ అదేమిటో మాత్రం స్పష్టంగా ఇప్పుడు గుర్తురావటం లేదు. మీరు చదివేరా? ఎవరు రాశారాకథని?" అవికొంత దూరం తన స్కూటర్ని స్లోగా నడిపించి— "ఇక వస్తాను. ఇవ్వాళ పదకొండున్నరకు మీటింగ్ ఒకటి ఏడ్చింది. అన్నట్టు మీరూ కథలు చదవటం మొదలెట్టారేమిటి? సాహిత్యాభిరుచిని అలవరుచ కుంటున్నారన్నమాట! మంచిదే. కంగ్రాచ్యులేషన్స్ అంటూ డబడబా స్కూటర్ స్పీడుని అధికం చేసి వెళ్ళిపోయాడు!

ఆయన మాటలు విని రమణ మనస్సులో ఏదో వ్యధ. హృదయంలో ఎవరో గునపాలు పెట్టి పొడిచిన బాధ. ఈ విశ్వనాథం వెడుతూన్నవాడు తనంత తాను వెళ్ళక తన స్కూటర్ని స్లో చేసి, నా వెనకే వచ్చి నన్నిలా కించపరచటం దేనికి?" అని బాధపడిపోయాడు రమణ.

ఈ జనానికి ఏమయిపోతున్నదీ అర్థంకావటం లేదు అతనికి. వీళ్ళంతా ఇంతగా చదువుకుని, ఇంతింత పెద్ద ఉద్యోగాలు చేస్తున్నా ఒక్కరూ ఒక్క పుస్తకం చదవరేం? ఒక్కొక్క కథని చదివి దాన్ని విశ్లేషించరేం? "ఇదిగో రమణా నీ కథ నే చదివానోయ్. చాలా బాగుంది' అని ఒకరెండు ముక్కలనొచ్చుగా? కాని తను సాహిత్య వ్యాసంగం చేస్తూన్న ఈ పదేళ్ళల్లోనూ ఏ ఒక్కరూ ఇలా అనలేదే? ఇలాంటి వ్యక్తులున్న ఈ సమాజం ఏమైపోతుంది?ఇలాంటి సమాజంలో మన సాహిత్యమెలా అభివృద్ధి చెందుతుంది?" ఇలా ఆలోచిస్తూనే గగన్‌విహార్ మెట్లెక్కుతున్నాడు రమణ.

"నమస్కారం మేష్టారూ..." అని వినపడింది. వెనక్కి తిరిగి చూస్తే అతని ఆఫీసున్న కాంప్లెక్స్‌లో మూడవ అంతస్థులోని ఆఫీసులో పనిచేస్తున్న స్త్రీ. రోజూ మెట్లు ఎక్కుతూనో దిగుతూనో కనిపిస్తూ ఉంటుంది. ముఖపరిచయమే గాని ఇందాకా ఒక్కసారి కూడా మాట్లాడలేదామెతో.

"నమస్కారమండీ.. మీరు.." నసిగాడు రమణ.

"నాపేరు వనజ. ఈ పై అంతస్థులో ఉండే ఆఫీసులో స్టెనోని. మొన్నటి ఆదివారం నాటి మీ కథను చదివా. దాన్ని చదివింతర్వాత ఎన్నాళ్ళకో ఒక మంచి కథను చదివేనన్న తృప్తి కలిగింది నాకు...".

"అందులో ఉన్న హీరోయిన్‌ని నేటి సమాజంలోని స్త్రీ జీవితానికి అతిదగ్గరగా మలిచారు మీరు. మీరన్నట్టు మన దేశంలో స్త్రీకి ఏనాటికైనా విముక్తి కలిగేనా?"

మరో బెత్తెడు పెరిగాడు రమణ.

"కానీ మీరు ఆ స్త్రీ చనిపోయే ముందు ఆమె పడే బాధను అలా సృష్టించారెందుచేత? అయినా..."

అతనికి తనింకా పెరిగిపోతున్నట్టనిపించింది.

"ఏది ఏమయినా మేమంతా కలిసి మీ కథ మీద ఒక గోష్ఠి ఏర్పాటు చేయదలుచుకున్నాం.."

ఈ మాటలు వినపడుతుంటే రమణ ఇక 'పెరగటం' మానేశాడు. తన చుట్టూ ఉన్న పరిసరాల్నోసారి చూశాడు. పధ్నాలుగు అంతస్థులున్న తన ఆఫీసు బిల్డింగూ, లిఫ్టూ, దాని పక్కనున్న మెట్లూ, తనామెతో మాట్లాడుతూ ఆ మెట్లని ఎక్కుతూండటం. ఫర్వాలేదు. తను తెలివిగానే ఉన్నాననుకున్నాడు.

"మాస్టారూ. నేను మీలానే రాయాలని ప్రయత్నిస్తున్నాను. కానీ కుదరటంలా!... అదిగో అపుడే మీ ఫ్లోర్ వచ్చేసింది.. వస్తానూ.." అంటూ మెట్లెక్కుతూ వెళ్ళిపోయింది.

"అలా అంటూందేమిటీవిడా? ఈవిడా ఒక రచయిత్రేనా? వనజ... వనజ" ఏదో లీలగా జ్ఞాపకం వస్తోంది అతనికి.

రమణ తన రూంలోకి పోయి, బెల్లుమ్రోగించి, బంట్రోతుని పిలిచి ఓ గ్లాసెడు మంచినీళ్ళు తెప్పించుకుని తాగుతూ చేతిలో ఉన్న ఆంధ్రా ఎక్స్‌ప్రెస్ ఆదివారం స్పెషల్‌ని తిరగేస్తూ ఒక చోట ఆగిపోయాడు. అందాకా తన కళ్ళలో ఏదో పొర ఉన్నట్టూ అది అప్పుడే విడిపోతున్నట్టూ అనిపించిందతనికి. తనకథ పక్కనే వనజ కథ కనిపించింది అతనికి— ఆమె ఫోటోతో సహా! ఆమె ఒక ప్రముఖ రచయిత్రి అని అతనికప్పుడే తెలిసొచ్చింది.

